# ఉత్తరువు

"అబ్బ, ఎంత చల్లగా వుంది నాన్నా!" అంది వైశాలి, నుదుట క్రమ్ముకున్న చెమట బొట్లను కొంగుతో తుడిచేసుకుంటూ.

"సరేనమ్మా, కాస్సేపు కూచుందాం" అన్నాడు రామదాసు.

వాళ్ళెక్కి దిగుతున్నది చిన్న కొండ. మూడువందల పైచిలుకు మెట్ల దారి. క్రింద ఒక వంద మెట్లదాకా కన్నతల్లి మనసులాంటి గానుగ చెట్ల నీడ చలువ పందిరిలా దట్టంగా క్రమ్ముకుని వుంటుంది, ఆపైన మిగిలిన సోపాన పంక్తి అంతా నిరాచ్ఛాదితం. యాత్రార్ధం వచ్చిన భక్తులు, అక్కడే వుండి సేవచేస్తున్న మొక్కుబళ్ళ వాళ్ళు కొండ మెట్లెక్కడం ఉదయం ఆరింటికే ప్రారంభమైపోతుంది. కానీ తిరిగి రావడ్డానికెట్లాగైనా తొమ్మిదవుతుంది గదా! ప్రొద్దుపొడుపు వేళ ఎంతో నమ్రభావంతో గుట్టకు, గుడి ప్రాకారాలకు, గాలి గోపురానికి బంగారు మలామా అద్దిన లేత యెండ అప్పటికి బాగా తెలివి మీరి కరకరలాడిపోతుంది. రెండు వందల మెట్లు దిగి చల్లటి నీడ పట్టులో అడుగు పెట్టేటప్పటికి, ఆహ్-ప్రాణాలకెంత హాయిగా వుంటుందో!

పడమటి పిట్టగోడ దాపున కూర్చుని బడలిక తీర్చుకోసాగింది వైశాలి. రామదాసు పిట్టగోడకానుకుని కనిపిస్తున్న విశాలాకాశంలోకి చూపులు సారిస్తున్నాడు.

షోలింగపురం నుండి ఆర్కోణానికి వెళ్ళే ట్రంకురోడ్డు, ఒక కిలోమీటరు దూరంలో చింత చెట్ల మధ్య మెలికలు తిరుగుతూ సాగిపోతోంది. చెట్ల నడుమ దాగుడు మూతలాడినట్లుగా దూసుకుపోతున్న బస్సులు, లారీలు మరబొమ్మల్లా కానవస్తున్నాయి. దగ్గర్లో ఎక్కడో ఏదో ఫ్యాక్టరీ వుందట. ఉద్యోగులు స్కూటర్లపైన, సైకిళ్ళపైన పరతెంచి పోతున్నారు. రోడ్డుకు, గుట్టకు నడుమ విస్తరించి వున్నవన్నీ పంట పొలాలే అయినప్పటికీ జలాధారం లేకపోవడం వల్ల ఎక్కువ భాగం బీళ్లుగా మారి బోసిపోతున్నాయి. ఆ బీళ్ళలో ఎనుములు మేపుకుంటున్న పల్లెటూళ్ళ కుర్రాళ్ళదే రాజ్యమైపోయింది.

"వెళ్దామా నాన్నా! ఆకలిగా వుందేమో మీకు?" క్షమాపణ కోరుతున్నట్టుగా అంది వైశాలి.

రామదాసు నవ్వాడు. "భలే మంచి దానవమ్మా నువ్వు! నాదేముంది! వయసు అయిదు పదులు దాటిందంటే, జఠరాగ్ని క్రమేపీ తగ్గుముఖం పడుతుంది. ఉదయం ఉపాహారం మానేసి ఏకంగా మధ్యాహ్నం భోజనం చేయమన్నా నాకేమీ యిబ్బంది ఉండదు. ఇంకా నీ మాట చెప్పు. రాత్రుల్లో రెండేసి చపాతీలతోనే సరిపెట్టుకుంటున్నావు. తొలికోడి కూతతోనే చన్నీటిలో తలస్నానం, పాండవతీర్థం దగ్గర నాగప్రతిష్ట చుట్టూ నూటపదహారు సార్లు ప్రదక్షిణం, మళ్ళీ కొండపైన కోదండ రామస్వామి గుడికి, ఆంజనేయస్వామి గుడికి నూటపదహారేసి ప్రదక్షిణాలు, తర్వాత ఎక్కినన్ని మెట్లూ దిగి రావాలి. అప్పటికీ యిదెంతో నయం. మహానుబావుడు యోగనరసింహస్వామి అయితే భూదేవికి గొడుగులాంటి

ఆ నిటారు కొండపైకెక్కి కూర్చున్నాడు. ఆయనకొక శుక్రవారం మాత్రమే కేటాయించడం వల్ల బ్రతికిపోయాము. అయినా యిందులో మన పాత్ర ఏముంది? నిమిత్తమాత్రులం. చోదక శక్తి వేరే వుంది. అడ్రస్సు : రూం. నెబరు టూ, దేవరాజ కళ్యాణ మంటపం... ఈ పాటికి టిఫిన్ సిద్ధం చేసి కాపెట్టుకుని వుంటుంది..."

నిజమే, షోలింగర్ యాత్ర నూటికి నూరుపాళ్ళు కళ్యాణి ప్రతిపాదన, భారతదేశంలో చెట్టుకొక గాథ వుంటుంది. పుట్టకొక గాథ వుంటుంది. అవన్నీ పట్టించుకోదగ్గవి కావని రామదాసు అభిప్రాయం. అయితే భగవద్భావనకు సంబంధించినంత వరకు భార్యాభర్తలకు ఏకీభావం లేదు. ఒక కిరోసినాయిల్ స్టవ్వు, అత్యవసర భోజన సామాగ్రి, ఓ సూట్‌కేస్‌లోను ఏర్‌బ్యాగ్‌లోను బట్టలు - ఈ మాత్రం సరంజామాతో కళ్యాణి భర్తను, కుమార్తెను బయల్దేరదీసింది. టౌనులో బస్సు దిగితే కొండపాళ్యానికి మూడు కిలోమీటర్లు. గంటగంటకూ వ్యాన్లుంటాయి. చిన్నకొండ పాదపీఠంలో వ్యాను దిగి వాకబు చేస్తే, యాభై గజాల దూరంలో వున్న 'ఆర్చి' వైపు చూపించారు. దానిపేరు దేవరాజ కళ్యాణమంటపం. యాత్రికులు బస చేయడానికి గదులు కూడా వున్నాయట. "వెళ్ళి చూడండి, షణ్ముగం అని ఒకతనుంటాడు, వాచ్‌మేన్, సూపర్వయిజరు, మేనేజరు - అన్నీ అతనే!" అన్నారు.

ముగ్గురు సభ్యులున్న ఆ యాత్రికుల జట్టుకేసి పరకాయించి చూస్తూ "ఎన్ని రోజులుంటారు?' ' అని ప్రశ్నించాడు షణ్ముగం.

రామదాసు కళ్యాణి వైపు చూశాడు.

"అదేమిటయ్యా! సేవ చేయడం కోసం వచ్చిన వాళ్ళం. స్వామి అనుజ్ఞ యిచ్చిన తరువాతనే వెళ్తాం" అంది కళ్యాణి.

మేరువు తలక్రిందులైనా, సాగరాలు యింకిపోయినా తనమాట కింక తిరుగులేదన్నంత ధీమా ఆమె అభిప్రాయంలో ధ్వనించింది. వరమివ్వకుండా ఆ దేవుడెక్కడ తప్పించుకపోతాడన్న విశ్వాసం ఒకటి పునాదిగా వున్నంత వరకూ ఆమె అభిప్రాయాన్ని చెనకగల భౌతిక, అతిభౌతిక శక్తులేవీ వుండవు. ఆస్తికత్వమో, నాస్తికత్వమో ఏదో ఒకదానిపైన పరిపూర్ణమైన విశ్వాసం కలిగి వుండడం చాలా గొప్ప విషయం. బహుశా అలాంటి అదృష్టవంతులు నూటికొకరిద్దరైనా వుండరేమో!

"అబ్బో, ఎంత ఓపికండీ మీకు! రోజూ అమ్మాయి వెంట కొండెక్కుతున్నారు" అని ఎవరైనా అంటే, రామదాసు మారుమాటాడకుండా ముభావంగా వుండిపోతాడు. మోకాటి నొప్పుల మూలంగా కళ్యాణి పట్టుమని ఫర్లాంగు దూరమైనా నడవలేదనీ, అలా కాదని పంతానికి దిగి మెట్లెక్కి దిగితే యింక వారాల తరబడీ పడక వేయవలసిందేనన వాళ్ళకేం తెలుసు! తల్లికి సాధ్యం కానప్పుడు తండ్రి, తండ్రికి వీలుకానప్పుడు తల్లి- ఎవరో ఒకరు బిడ్డల పట్ల బాధ్యత నిర్వహించాలి గదా!

అయితే ఇదంతా తెచ్చికోలు బాధ్యతేనని రామదాసు అభిప్రాయం. వారించని దోషం అతనిదిగాదు. "చూడు కళ్యాణీ! సరోజిని డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాం గదా! ఆమె పరీక్ష చేసి ప్రతినెలా మందులు రాసిస్తోంది గదా! మళ్ళీ యిదొకటెందుకు?" అంటూ అతడామె ముంగాళ్ళకు బంధం వేయబోయాడు, దారిలో పడివున్న కంటకాన్ని తీసి అవతల పారేసినంత సునాయాసంగా భర్త మాటను కొట్టిపారేసింది కళ్యాణి, "ఏమిటండీ మీరు? మానవయత్నం మాత్రం వుంటే చాలునా? దైవానుగ్రహం కావద్దా? ఇంతకూ నాకొక సందేహం. సరోజిని డాక్టరు పైన్నయినా పూర్తిగా నమ్మకం వుందా మీకు?"

అంటే ఏమన్నమాట! 'మీకెట్లాగూ దేవుడిపైన నమ్మకం లేదు, మనుషుల పైన్నయినా వుందా'

అని ఎద్దేవా చేయడమే కదా!

సరే, నువ్వొకందుకు పోస్తే నేనొకందుకు త్రాగుతున్నానన్నట్లుగా క్షేత్రయాత్రకు బయల్దేరాడు రామదాసు. విరాణ్మూర్తుల మహిమల కన్నా, వెలుపలి విగ్రహాల సౌందర్యాలే అతడినెక్కువగా ఆకర్షించాయి. వరమిచ్చే దేవతలకన్నా, తమ బాధల్ని గాథల్ని వెళ్ళబోసుకోవడానికి వచ్చిన భక్త జనులే దర్శనీయులుగా కనిపించారు. చిన్న కొండపైన యోగాంజనేయ స్వామి గుడి మండపం తాలూకు మెట్లపైన కోనేటి కభిముఖంగా కూచుంటే ఎన్నెన్నో అపురూపమైన దృశ్యాలు కళ్లముందు కదలిపోతాయి. ఎవరైనా పట్టెడు బొరుగులు కోనేటి నీటిలో చల్లితే తండాలు తండాలుగ వచ్చి బడుంగున మింగేసే చేపలు, కోనేటిపైకి వంగిన రావిచెట్టు కొమ్మల్లో అవిరామంగా సర్కస్ ఫీట్లు చేసే కోతులు, వాటికి దొరికిపోకుండా తక్కుతూ తారుతూ చెట్టంతటా తాముగానే విహరించే ఉడతలు, దిగంతాల వరకూ తలపెట్టిన విహారయాత్ర మధ్య ఒక మజిలీ వెదికి పట్టుకున్నట్టు ఒక్కుమ్మడిగా వచ్చి రావి చెట్లో వాలిపోయే రామచిలుకలు, రెక్కలు కదలకుండా ఎక్కడో దూరంగా వినువీధిలో ఒక గీత గీచినట్లుగా సాగిపోయే ఒంటరి డేగ...

ప్రకృతి విలాసాలను, ప్రాణుల జీవనోత్సాహాలను పరికించడంలాగే మనుషుల వాలకాలను, ఆంతర్యాలను గమనించడమున్నూ రామదాసుకెంతో యిష్టం, ఎన్నెన్ని ప్రాంతాల వాళ్ళు! ఎన్నెన్ని భాషల వాళ్ళు! ఎన్నెన్ని ఆకారాల వాళ్ళు! కడప జిల్లా కోడూరు ప్రాంతం నుంచి ఓ కుటుంబం వానల్లేక, జలాధారాలింకిపోయి వాళ్ళ పళ్ళ తోటలన్నీ ఎండిపోయాయట. అప్పుల వాళ్ళు వేలం పాటలో పొలాలు లాగేసుకున్నారు, సాటివారిలో పరువుగా బ్రతకడానికి దారి ఏదైనా చూపిస్తాడేమోనన్న నమ్మకంతో ఆ కుటుంబ సభ్యులు ఘటికాచలేశ్వరుడి దగ్గరికి వచ్చేశారు. (రామదాసు స్వగతం : చెడి చెన్నపట్నం వెళ్ళొచ్చు గదా! భంగపడి బెంగుళూరు వెళ్ళొచ్చు గదా! అయిసా పైసా హైదరాబాదులో తేల్చుకోరాదా!) ఉత్తరార్కాడు జిల్లా ఆరణి నుంచి ఓ నాయుడు గారు సతీ సమేతంగా వచ్చారు, భార్యకు మతి స్తిమితం లేదట, అన్ని చికిత్సలూ చేయించి అసురుసురైన తర్వాత ఆమెను యిక్కడికి లాక్కొచ్చేశారు. (రా. స్వ. కోర్టు లన్నీ తోసేస్తే సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకున్నట్టు.) కదిరికీవలిస్టేషను తనకల్లునుంచి వచ్చిన సంజీవప్పది ఆడపిల్ల పెళ్లి సమస్య. పెద్దమ్మాయికెప్పుడో పెళ్లి కావలసింది. రెండో అమ్మాయికి గూడా ఆలస్యమైపోతోంది. మూడో అమ్మాయికి మాత్రం యిప్పటికప్పుడే చేసేయవచ్చు. కట్నాల మార్కెట్లో వరుల రేట్లు మండిపోతున్నాయి. నిస్సహాయ పరిస్థితిలో భగవంతుణ్ణే ఏడుగడగా నమ్మి, భార్యా బిడ్డలతో కలిసి అనుదిన సేవలో నిమగ్నుడై వున్నాడు సంజీవప్ప. (రా. స్వ. గాలిలో దీపం పెట్టి దేవుడా నీ మహిమ అన్నట్టు) కర్నాటక ప్రాంతం చింతామణి నుంచి వచ్చిన ముకుందరాజాది మరొక విడ్డూరమైన వృత్తాంతం. భార్య అడ్డానికి పెరగడం, కుమార్తె పూచిక పుల్లలా చిక్కిపోవడం ఆయనకు ఏకకాలంలో ఎదురైన చిక్కుముళ్ళు. గృహకృత్యాలు చక్కబెట్టుకోడానికి వీలుగా భార్య కాస్త చిక్కిపోవాలనీ, మగపెళ్ళి వారి కంటికి కొంచెం నదరుగా కూతురికి కొంచెం ఒళ్ళు రావాలనీ ఆయన ఆకాంక్ష. (రా. స్వ. పాపం, భగవంతుడికి సానుభూతి! ఆయన పైన ఎన్నెన్ని భారాలు వేస్తారో భక్తులు!)

ఆలోచనా స్రవంతి కడ్డుతగులుతూ అంది వైశాలి, "హాయిగా యింట్లో ఏదైనా చదువుకుంటూ, రాసుకుంటూ వుండాల్సింది మీరు! అన్ని పనులూ వదులుకుని నా కోసం యిలా వచ్చేశారు, నావల్లనే నాన్నా మీకీ యిబ్బందులన్నీ!"

"అబ్బె, అలా అనుకోకమ్మా వైశాలీ!" వెంటనే వారించాడు రామదాసు. "ఎల్లకాలం నాల్గుగోడల

మధ్య కూచోడం వల్ల నా వ్యాసంగానికి మాత్రం ఏం ఒరుగుతుంది? కొత్త ప్రదేశాలు, కొత్త మనుషులు, కొత్త అనుభవాలు చాలా అవసరం గదా! పెద్దలు కట్టి యిచ్చిన పెరుగన్నం ఎక్కడో దారి పయనంలో పని కొచ్చినట్టుగా, ఈ అనుభవాలు ఎక్కడైనా ఎప్పుడైనా పనికొస్తాయి..."

"ఏం నాన్నా! విషయమేదైనా దొరికిందా? షోలింగర్ గురించి కథ రాస్తారా?" కుతూహలంతో ప్రశ్నించింది వైశాలి.

"వస్తువు కోసం వెదుక్కుంటూ వెళ్ళనక్కర్లేదమ్మా వైశాలీ! జీవితం పట్ల అక్కర వుండాలి, శ్రద్ధగా పరిశీలించాలి, సానుభూతితో గ్రహించాలి, మరొక విధంగా చెబుతాను, భక్తి సాంప్రదాయంలో నువ్వు మీ అమ్మకు అనుయాయివి గదా! మీకు దేవుడి పట్ల ఎంతటి భక్తి భావం వుంటుందో, రచయితకు మనిషి పట్ల, మానవ జీవితం పట్ల అలాంటి ఆరాధనా భావం వుండాలి, భగవంతుడు భక్తుడికి ప్రసన్నమయ్యే విధానం గురించి నేనేమీ చెప్పలేను, కానీ జీవితం పట్ల ఆసక్తి, అనురక్తీ, భక్తీ వున్న రచయితకు గాలిలో ఎగిరి వచ్చి దోసిలిలో పడిపోయే కమనీయ పుష్పంలా కథా వస్తువు సునాయాసంగా దొరికిపోతూ వుంటుంది..."

కొంతసేపు తండ్రి మాటల్నే మననం చేసుకుంటూ వుండిపోయాక "సరే నాన్నా! ఇక వెళ్దామా? అంటూ పైకి లేచింది వైశాలి, మోకాళ్ళపైన చేతులుంచుకుంటూ."

కొన్ని మెట్లు దిగేసరికి వెనుక వైపు నుంచి ఎవరో పరుగెడుతూ వస్తున్నట్లుగా అడుగుల సవ్వడి వినిపించింది, వెనువెంటనే పిలుపు గూడా!

"అక్కా, అక్కా! ఒక మాట!"

చెదిరిపోయిన పొడి వెంట్రుకల క్రాపింగు, నుదుట గంధపు బొట్టు. ముక్కపుటాన కుంకుమ రేఖ. దోరమామిడి చెక్కల్లాంటి నున్నటి బుగ్గలు, చిన్న షరాయి పైన పొట్టి చేతుల చొక్కా, పదేళ్ళ కుర్రాడొకడుకురంగ శాబకంలా దూకులిడుతూ వస్తున్నాడు.

వైశాలి క్రింది మెట్టుపైన నిల్చుంది, వచ్చిన కుర్రాడు పై మెట్టు మీద నిల్చున్నాడు. వైశాలి చెవి దగ్గరికి వంగి ఆమెకు మాత్రం వినిపించేట్టుగా ఏదో అడిగాడు. ఆమెనవ్వుతూ లేదన్నట్టుగా తల అడ్డంగా తిప్పింది. "రేపు కలుసుకుంటాలే అక్కా! తిరిగొచ్చేటప్పుడు, సేతు బంధనాయనమః దగ్గర మరిచిపోకు..."

అంతే, తుమ్మెదలా జారుకున్నాడు.

"ఏమిటమ్మా వాడి సాంకేతి భాష?" ఆశ్చర్యపడుతూ అడిగాడు రామదాసు.

"ఉత్తరువింకా కాలేదా అని అడిగాడు, లేదన్నాను, మెట్ల వెంబడీ పిట్టగోడపైన ఆంజనేయ స్వామి అష్టోత్తర నామాలు రాసి వున్నాయి గదా! రేపు మనల్ని 'సేతు బంధనాయనమః' అన్న మంత్రం దాపుగా వున్న మెట్టుపైన కూచుని తనకోసం వేచి వుండమంటున్నాడు...."

"ఎవడో గాని భలే గమ్మత్తయిన వాడిలా వున్నాడే!"

"ఎందుకు లెండి! కనిపించింది మొదలు నాకు ఫ్రెండై పోయాడు. అబ్బో, ఎంత కబుర్ల రాయుడో! తీరిక దొరికితే చాలు, కబుర్లే కబుర్లు. కథలే కథలు....."

"ఒంటరిగా వున్నాడే! తోడుగా పెద్ద వాళ్ళెవరూ లేరా?"

"ఎవరుంటారు? అరగొండ దగ్గర అదేదో పల్లెటూరి వాళ్ళది. తండ్రి వృత్తి పౌరోహిత్యం, అదే జీవనాధారం, పులిమీద పుట్రలాగా తల్లిదండ్రులిద్దరికీ జబ్బు చేసింది, చుట్టుప్రక్కల వున్న ఆసుపత్రుల కన్నింటికీ తిరిగారు. గుణం కనిపించలేదు, దూరాభారమనుకోకుండా పెద్ద ఆసుపత్రులకు

వెళ్ళాలంటే డబ్బులేదు, మరే దిక్కు లేనప్పుడు దేవుడే కదా దిక్కు! కానీ స్వయంగా జబ్బు మనుషులే వచ్చి సేవచేయాలంటే కుదరదే! వాళ్ళు వూళ్ళోనే వున్నారు, తల్లి తండ్రుల తరఫున వీడు సేవ చేస్తున్నాడు, మండలమో, మండలమున్నరో - ఎంతకాలమైనా సరే దేవుడుత్తరువిచ్చేదాకా యిక్కడినుంచి వెళ్ళేది లేదంటున్నాడు..."

కాళ్ళ కదలికకు, మనో చలనానికి కూడా కళ్ళాలు వేసి వెనక్కు లాగినట్టు రామదాసు స్తంభీభూతుడై నిల్చుండిపోయాడు, చందన చర్చ చేసినట్టుగా అతడి శరీరం పులకరించి పోయింది. అతి లోకమైన దృశ్యాన్ని చూచినట్టుగా ఆపాత మధురమైన సంగీతాన్ని విన్నట్టుగా మనసు పరవశించిపోయింది. ఈ మహా ప్రపంచం యొక్క స్థితికీ, గతికీ కూడా పునాది అయిన మౌలికాంశమేదో ఒక పదేళ్ళ కుర్రాడి రూపంలో అతడికి సాక్షాత్కరించినట్టయి పోయింది.

వైశాలి కొనసాగించింది -- "నాన్నమ్మ డెభ్భై యేళ్ళ ముసలిది వీడికి తోడుగా వచ్చింది. అయినా కాళ్ళు సరిగ్గా ఆడని, కళ్ళు సరిగ్గా కనిపించని ఆ ముసలిది వీడికేం తోడుగా వుంటుంది? ఇంకా వీడే తోడుగా వుంటూ, అవిడ అవసరాలన్నీ గమనిస్తున్నాడని చెప్పొచ్చు, వీడున్నాడే నాన్నా, ఈ నిరంజన్ బాబు, వీడు తలచుకుంటే చింత చెట్లో మల్లెపువ్వులు పూయించగలడు, గుడిలోని పూజారులకు వీడెప్పుడో దగ్గరివాడైపోయాడు. దేవుడికి నివేదన చేసిన తర్వాత వాళ్లిచ్చే ప్రసాదంతోనే కడుపు నింపుకుంటాడు, నాన్నమ్మకు కూడా కొంచెం పొట్లం కట్టించుకుంటాడు. పాండవ తీర్థం ఎదుట మిట్టపైన ఆర్యవైశ్య సత్రం వుందట వాళ్ళు రాత్రుల్లో నాలుగు చపాతీలిస్తారట, చెరి రెండు తిని, నీళ్ళు తాగి పడుకుంటారట...

చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంటూ అడిగాడు రామదాసు -- "అమ్మా వైశాలీ! ఎవడమ్మా వీడు? పుట్టంధులైన తల్లితండ్రుల్ని కావడిలో మోసుకు తిరిగిన శ్రావణ కుమారుడా. తల్లితండ్రుల్ని పూజించనిదే గృహకృత్యాల జోలికి వెళ్ళని ధర్మవ్యాధుడా? తల్లి ఉపవాస దీక్షను విరమించడం కోసం మబ్బుల గుంపులో సూర్యబింబాన్ని వెదుకుతూ వీధి గుమ్మంలో నిల్చునే మోహనదాసు కరంచంద్ గాంధీయా? ఎవడమ్మా, ఈ నిరంజన్ బాబు?"

★ ★ ★

రామదాసు కుటుంబం ఆ క్షేత్రంలో గడపిన అరమండలంలో చివరి వారం పదిరోజులు క్షణాల్లో దొర్లిపోయాయి. అందుకు కారకుడు నిరంజన్ బాబు.

ఆ కుర్రాడొచ్చేసాడంటే చిరుగంటల గలగలలు సందడించినట్టు ఎంతటి స్తబ్ధ వాతావరణంలోనైనా సంచలనం పుట్టుకొచ్చేది. కొండ దిగుతూ నీడలో కూర్చున్న విశ్రాంతి సమయంలో వాడు వైశాలి దగ్గర వెలిబుచ్చిన సందేహాలు, సంధించిన ప్రశ్నలు, వేసిన పొడుపు కథలు, చెప్పిన కథలు అన్నీ యిన్నీ కావు.

"అక్కా, అక్కా! ఘటికాచల క్షేత్రమంటే అర్థమేమిటో తెలుసా?"

"తెలియదే! అర్థమంటూ ఏదైనా వుందా బాబూ?"

"పోనీ, సార్‌నడిగి చెప్పరాదూ?"

వైశాలి తండ్రి వైపు చూస్తుంది. రామదాసు ఏమీ తెలియని వాడిలా అమాయికంగా బేలముఖం పెట్టాడు.

"ఘటికాచల క్షేత్రమంటే..." పొడుగ్గా రాగం దీసి వివరిస్తాడు నిరంజన్ బాబు. "ఘటిక అంటే గడియ అన్నమాట! గడియ అంటే ఎన్ని నిమిషాలు? ఇరవై నాలుగు. ఇక్కడ భగవంతుడు

ప్రసన్నం కావడానికి ఇరవైనాలుగు నిమిషాలుచాలట! అందుచేత దీనికి ఘటికాచలమని పేరొచ్చింది........''

"అలాగా! నీకెలా తెలిసింది బాబూ?''

"చెవులకు పోగువేసుకున్న కంచుకంఠం పూజారి తెలియదా అక్కా, ఆయన పేరు నారాయణాచారి, మేమున్న సత్రం దగ్గరే వాళ్ల యిల్లు, రాత్రుల్లో ఓ గంట సేపు ఆయన్ను నిద్రపోవనివ్వను. ఇట్లాగే ఎన్నో కబుర్లు చెబుతుంటాడు....''

"ఏదీ, యింకొకటి చెప్పు, చూద్దాం....''

"ఘటికాచలం మహిమల్ని గురించి ఇద్దరు తెలుగు కవులు గ్రంథాలు రాశారట. అందులో ఒకరేమో ... నీకు తెలుసు, వికటకవి అంటారతన్ని...?''

"ఎవరు? తెనాలి రామకృష్ణుడా?''

"రైట్ రైట్. కనిపెట్టేశావు?''

"ఇంకెవరు?''

తలగోక్కుంటూ అంటాడు నిరంజన్ బాబు "ఎన్నిసార్లు చూచిపెట్టుకున్నా ఆ పేరు మరిచిపోతూనే వుంటా. ఉండు, ఇప్పుడే చెప్తానుండు ...'' జేబులో నుండి ఒ చీటితీసి, మడతలు విప్పి, ఆ పేరును ప్రకటించేస్తాడు .... "కొక్కొండ వేంకటరత్నం పంతులు గారు. ఎప్పుడైనా విన్నావా అక్కా?''

"ఎవరబ్బా ఆయన? మీకేమైనా తెలుసా నాన్నా?''

రామదాసు పెదవి పైన విరిసే చిరునవ్వే అందుకు జవాబు.

ఇట్లాగే ఉత్తర ప్రత్యుత్తరాల రూపంలో ఎన్నెన్నో వర్తమానాలు, మనదేశంలోని దివ్య తిరుపతులెన్ని? నూట ఎనిమిది, అందులో ఆంధ్రాలో వున్నవి ఎన్ని? రెండు. అవిఏవి? తిరుపతి, అహోబిలం, షోలింగరను పూర్వ కాలంలో ఏమనేవారు? చోళలింగపురం, ఎందువల్ల? చోళులిక్కడొక శివలింగాన్ని ప్రతిష్ఠించడం వల్ల.

క్రితం రోజు రాత్రి నారాయణాచారి చెప్పిన విశేషాలన్నీ మరునాటి కల్లా 'క్విజ్' రూపంలో వైశాలిని ఎదుర్కొని, ఆమె ఏ ఒక్క ప్రశ్నకూ జవాబు చెప్పలేక పోవడం వల్ల మార్కులన్నీ క్విజ్ మాష్టరుకే దాఖలై పోతుండేవి.

ఇలా నాలుగు రోజులు గడిచేటప్పటికి వైశాలి లాగే కళ్యాణి గూడా నిరంజన్‌కు ఆత్మబంధువై పోయింది. కొండపై నుంచీ తెచ్చిన ప్రసాదాన్ని నాన్నమ్మకు అప్పగించిన తర్వాత చక్కా దేవరాజ కల్యాణ మండపానికి వచ్చేసేవాడు. "పెద్దమ్మగారూ! కూరగాయలు కొనుక్కురమ్మంటారా? మంచినీళ్లు తెచ్చిపెట్టమంటారా? సార్‌కు న్యూస్‌పేపరు కావాలంటే చెప్పండి'' అంటూ అడిగి అడిగి పనులు చేసి పెట్టేవాడు, "ఇప్పుడేమీ తేవద్దు గానీ నింపాదిగా కూచోరా నాన్నా'' అంటుండేది కల్యాణి, కానీ జడుడిలా కూచోడం వాడి స్వభావానికి విరుద్ధం గదా! వైశాలి దగ్గరికి వెళ్ళి 'అక్కా, అక్కా ఓ కథ చెప్పవూ' అని మారాం చేసేవాడు.

పసిపిల్లలకి కాసక్తి కరమైన కథలేవైనా జ్ఞప్తికి తెచ్చుకుని, చెప్పడానికి పూనుకునేది వైశాలి. కానీ తీరా నాలుగైదు వాక్యాలు కొనసాగించేటప్పటికి 'అదా, ఆ కథ నాకు తెలుసులే అక్కా! వేరే కథ చెప్పు' అనేవాడు.

ఆ 'వేరే కథలు' గూడా నిరంజన్‌కు తెలిసినవి గానే పరిణమించడం వల్ల, వైశాలి కథలు

చెప్పే ప్రయత్నానికి గూడా స్వస్తి చెప్పేసింది. "ఒరే నాయనా నిరంజన్ బాబూ! ఖథల్లో గూడా నీదే పైచేయి. ఒప్పుకున్నాను గదా! నువ్వే చెప్పు. నేను వింటాను" అనేసింది.

నిరంజన్ బాబు బుంగ ముఖం పెట్టి నేల చూపులు చూస్తూ స్వగతంలా చెప్పుక పోసాగాడు. "చెప్పేవాణ్ణే! కానీ ఈ వూరి కొచ్చినప్పటినుండి కథలు చెప్పీ చెప్పీ నాకు నోరు నొప్పెట్టి పోతూ వుంది. టీ బంకు చిన్నప్ప కొడుకులేడూ దీనూగాడు, నాకంటే పెద్దోడే! ఏడో, ఎనిమిదో చదువుతున్నాడు, వాడు, వాడి జుట్టులో వుండే రౌడీ కుంకలు నన్ను వేపుకతిన్నారనుకో! ఎక్కడ కనిపించినా గిచ్చి జగడానికి పిలిచేవాళ్లు. మొట్టికాయలేసేవాళ్లు. 'రోజుకో పావలా యిచ్చుకో లేకుంటే ముప్పై మొట్టికాయలైనా తిను' అంటూ బెదిరించేవారు. "బాబ్బాబూ! నా దగ్గర పావలాల్లేవురా! కావలిస్తే కథ ఏదైనా చెబుతానన్నాను. ఏదీ, చెప్పు చూద్దామన్నారు. మొదటి రోజున 'ఆలీబాబా నలభై దొంగల కథ' చెప్పాను. కోతినాయాళ్లు, కదిలీ మెదిలీ వున్నారంటే ఒట్టు, ఊపిరి బిగబట్టుకుని కూచున్నారు, అయితే ఆ కథ చెప్పడం గూడా నా ప్రాణానికే వచ్చింది. సాయంత్రం అయిదు గంటలకు పట్టుకున్నారంటే, భోజనాల వేళ దాకా చెబుతూ వుండాల్సిందే! రోజూ ఏడూ, ఎనిమిదీ, పదీ, ఎన్నని చెప్పిచావడం అక్కా! చెప్పకపోయానో, చెవిమెలేస్తారు, పావాలా యిచ్చుకోమంటారు ....?"

"అయ్యో, పాపం!"

"కాదులే అక్కా! అప్పటికి వాళ్లేనా మొనగాళ్లు? నాకూ ఉపాయాలొచ్చును, ఏం చేశానో తెలుసా? అయిదు రోజులుగా ఒకే కథ చెబుతున్నాను, మాయల మంత్రగాడు చనిపోతాడనుకో! అయినా కథ అయిపోదు, వాడి నెత్తురు బొట్లలో నుంచి అలాంటి మాంత్రికులే పుట్టుకొస్తారు, వాళ్లు రాకుమారుణ్ణి తీసుకెళ్ళి ఇనపచట్రం మేడలో బంధిస్తారు. అక్కడొక చీలను తాకడంతో ఒక సొరంగం తెరచుకుంది, దాని గుండా వెళ్తే పెద్ద అడివి. అడివిలో ఒక కోట. ఆ కోటలోని వింత మనుషులందరూ చచ్చి పడివున్నారు. పొద్దుపోయి చీకటి పడేటప్పటికి వాళ్లు నిద్ర మేలుకున్నట్టుగా లేచి కూచుంటారు, 'నరవాస, నరవాసన' అంటూ రాకుమారుణ్ణి తరుముతుంటారు. అతడు పరుగెత్తగా పరుగెత్తగా ఒక మర్రి చెట్టు, ఆ చెట్టు తొర్రలో ఒక బైరాగి, స్వామీ, శరణు, శరణు అంటూ బైరాగి పాదాలపైన వాలతాడు, బైరాగి అతణ్ణి ఒక చిలకగా మార్చేస్తాడు ..... ఆ చిలక పల్లెలు దాటి, పేటలు దాటి, అడవులు దాటి, అలాగే పోతూ,..... పోతూ...."

"భలే, భలే," అంటూ విరగ బడినవ్వసాగింది వైశాలి 'కుక్కకాటుకు చెప్పుదెబ్బ అంటే అంటే అదే మరి!' అంటూ కల్యాణి తాను కూడా నవ్వులో శ్రుతి కల్పింది. రెప్పపాటు లేని కళ్లతో రామదాసు ఆ కుర్రాడివైపు సాలోచనగా చూస్తూ వుండిపోయాడు.

ఆఖరుకు విడిపోవలసిన సమయం రానే వచ్చింది. ఆ రోజు శుక్రవారం, "చూడు బాబూ! ఈ రోజు పెద్ద కొండకు వెళ్లి వచ్చాంగదా! రేపు మా వూరికి వెళ్లిపోతున్నాం' అంది కల్యాణి.

"పెద్దమ్మగారూ! మీకు ఉత్తరువైందా?" మనసంతా విప్పి ప్రశ్నించాడు నిరంజన్ బాబు.

"అయిందిలే! అయింది గనుకనే గదా వెల్లడం!"

బాబు ముఖంలో దిగులు కెరళ్లు కెరళ్లుగా వ్యాపించింది, "దేవుడి కింకా మా పైన దయ కలగ లేదు. ఎప్పుడుత్తరువిస్తాడో, మేమెప్పుడు వూరికి వెళ్తామో, అమ్మా, నాన్నా ఎలా వున్నారో...?' ' ప్రత్యుత్తరం దొరకని ప్రశ్నల దగ్గరే ఆగిపోయి ఖిన్నుడైకూచున్నాడు. కల్యాణి వాడి ముఖం చూడలేక ముఖం త్రిప్పుకుంది. వైశాలి కన్నీళ్ళు ఆపుకోలేక పోయింది. రామదాసు చూపులు మాత్రం కల్యాణి పైనుంచి వైశాలి పైకి, వైశాలి పైనుంచి బాబు పైకి ప్రసరించసాగాయి, ఇలాంటి అమాయకుల నమ్మకాలు

వమ్మగాకుండా వుండడం కోసమైనా భగవంతుడంటూ ఒకడుండాలి, అసలున్నాడో, లేదో ....

★ ★ ★

రామదాసు కుటుంబం షోలింగర్ వెళ్లి వచ్చి చాలా కాలమైంది. సేవచేసి వచ్చిన మరు సంవత్సరమే వైశాలి మరో చిన్న వైశాలిని ఒడిలో పడుకోబెట్టుకో గలిగింది. మొక్కుబడి మేరకు కల్యాణి మనవరాలికి 'అమృతవల్లి' అని అమ్మవారి పేరే పెట్టుకుంది. అమృతగూడా యింతై అంతై పెద్దదైంది. పై సంవత్సరం హైస్కూల్లో చేరుతుంది.

రామదాసుకు సంబంధించినంత వరకు షోలింగర్ యాత్ర విస్మృతిపథంలో పడిపోయిందని చెప్పొచ్చు. నాలుగు రోజుల క్రిందట ఒక ప్రత్యేక సంఘటన గనక జరగకపోయి వుంటే అతడా అనుభవాన్ని మళ్లీ నెమరుకు తెచ్చుకోవలసిన అవసరం కలిగి వుండేది గాదు. ఉదయం పది గంటలప్పుడు 'రామదాసుగారి యిల్లెక్కడండి?' అని వీధిలో వాకబు చేస్తున్న గొంతు వినిపించింది. కొన్ని నిమిషాల్లో ఆగంతుకుడే వచ్చి గుమ్మంలో నిలబడి పోయాడు. "నమస్కారమండీ!" అంటూ చేతులు జోడించాడు. "చిత్తూరు డిగ్రీ కాలేజీలో ఆఖరు సంవత్సరంలో వున్నాను. ఈ మధ్య నా కథ ఒకటి పత్రికలో వచ్చింది. అచ్చుకానివి గూడా రెండో మూడో వున్నాయి. మీకొకసారి చూపించి, పొరబాట్లేవైనా వుంటే సవరించుకుని....."

ఈలోగా రామదాసు చూపులు ఆయువకుణ్ణి, ఆ యువకుడి చూపులు రామదాసునీ పూర్తిగా సర్వేచేసి, పూర్వ పరిచయాన్ని తిరగ తోడుకోగలిగాయి.

"సార్ ..... మీరు .... మీరు ....."

"బాబూ ..... నువ్వు ......నువ్వు...."

అయితే కొత్త వ్యక్తి మాటలు విని హాల్లోనించి ఈవలికి తొంగి చూచిన కల్యాణే అతణ్ణి మున్ముందుగా పోల్చుకోగలిగింది.

"నాయనా నువ్వు నిరంజన్‌బాబువి గదూ! పదేళ్ళ క్రితం షోలింగర్లో ....."

"అవునండీ పెద్దమ్మగారూ! భలేవారండీ మీరు! పది రోజులు కలిసివున్నా బాబుగారెవరో మాట మాత్రమైనా చెప్పారు కాదు. నేనింకా ఎవరో, ఏమిటో అనుకున్నాను. పరవాలేదులెండి! ఎక్కడికి రావాలో అక్కడికే వచ్చేశాను. అన్నట్లు వైశాలి అక్క ఎక్కడండీ? ఆమెకు బిడ్డలు ...?"

"చెబుతారా బాబూ! ఎండలో పడి వచ్చావు. ముందుగా కాసాన్ని మంచినీళ్లు పుచ్చుకుందువురా. నింపాదిగా అన్ని విషయాలూ చెబుతాను."

ఆగంతకుడైన అబ్బాయి, ఆయింటి గృహిణి కూడా తాత్కాలికంగా రామదాసు ఉనికినే మరిచిపోయారు. ప్రశ్నలే ప్రశ్నలు, పరామర్శలే పరామర్శలు, నవ్వులే నవ్వులు.

★ ★ ★

మరునాడు రా దాసు కుమార్తెకొక ఉత్తరం రాసి పోస్టు చేశాడు.

"అమ్మా వైశాలీ! నిన్నటి రోజు మన యింట్లో ఒక విశేషం ఏర్పడింది. గతకాలపు తెరలను తొలగించుకుని పాత పాత్ర ఒకటి రంగస్థలం పైకి పునఃప్రవేశం చేసినట్లుగా ఓ యువకుడు మనయింటి కొచ్చేశాడు. పైజమాపైన జుబ్బా తొడుక్కుని, భుజానికొక సంచీ తగిలించుకుని, ముచ్చటగా తల దువ్వుకుని ఉదయకాలపు సూర్యకాంతిలో లేత కొబ్బరి మట్టలా నిగనిగలాడిపోతున్న పడుచువాడు వచ్చి వచ్చి మన యింటి గుమ్మంలో నిల్చున్నాడు. షోలింగర్ కొండపైన మనకు నిరంజన్‌బాబుగా పరిచయమయ్యాడే పదేళ్ల కుర్రాడు - వాడే వీడు! పువ్వు పుట్టగానే పరిమళమని మనకానాడే

తెలిసొచ్చింది గదా! రాయకపోతేనే ఆశ్చర్యపడాలి గానీ, వాడు కథలు రాయడంలో ఆశ్చర్యమేముంది? తాను రాసిన కథలు కొన్ని తీసుకొచ్చాడు, వాళ్లమ్మా, నాన్నా అనారోగ్యమనే గ్రహణం నుంచి బయటపడ్డారట! తనీ సంవత్సరం డిగ్రీ పరీక్షలు రాయబోతున్నాడట. నువ్వు చెప్పేదానివి గదా, కబుర్ల రాయడని! నిన్నంతా వాడి కబుర్లతోనే మాకు పొద్దుపోయింది. అమ్మా వైశాలీ! మిగిలిన విషయాల మాటకేం గానీ ఆ అబ్బాయి రాకకు వెనుక ఏదో పరమార్థ మున్నట్టు నాకు తోచింది. షోలింగర్ గురించి కథరాయలేదా నాన్నా - అని అడిగేదానివి గదా నువ్వు! రాయడానికి ఉత్తరువు వచ్చేసింది రాస్తున్నాను."

*(ఆహ్వానం, ఆగస్టు '93)*